క్లుప్తంగా

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



మరిపెడ రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని సూపర్‌వైజర్ శ్రీలత అన్నారు. మరిపెడ మండలం ఎల్లంపేట సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రం–3లో అంగన్‌వాడీ ప్రీ స్కూల్ పిల్లలకు గ్రాడ్యుయేషన్ డే (ఈసీసీఈ)వేడుకలను గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో విజయకుమారి, ఆయా, చిన్నారులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు ప్రారంభం

దోర్నకల్: మండలంలోని చాప్లాతండాలో గురువారం ముత్యాలమ్మతల్లి ఆలయ విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు ప్రారంభమయ్యాయి. గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయాన్ని ప్రారంభించి, ముత్యాలమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ వేడుకలను నిర్వహిస్తున్నారు. మొదటి రోజు ఆలయ ఆవరణలో హోమపూజ నిర్వహించి విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించారు.

ఆయుష్మాన్ భారత్ కార్డుల నమోదు



గూడూరు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్‌భారత్ నమోదు ప్రక్రియను పీహెచ్‌సీ వైద్యసిబ్బంది చేపట్టారు. మండల కేంద్రంలో గురువారం అయోధ్యపురం పీహెచ్‌సీ సిబ్బంది ఇంటింటికి తిరుగుతూ మహిళలకు సికిల్‌సెల్ పరీక్షలు (రక్తహీనత) నిర్వహిస్తూ, ఆభా కార్డు నమోదు చేశారు. కార్యక్రమంలో సిబ్బంది రజిత, పద్మ, సోమేశ్వరమ్మ పాల్గొన్నారు.

ఐడీ కార్డుల ఆవిష్కరణ



కురవి: మండల కేంద్రంలో మండల పాస్టర్ల ఫెలోషిప్‌కు సంబంధించిన ఐడీ కార్డులను గురువారం పాస్టర్ పీటర్ విజయ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లోకంలో ప్రస్తుతం చెడుమార్గంలో పయనిస్తున్న ప్రజల శ్రేయస్సు కోసం నిరంతరం తాము ప్రార్థనలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాస్టర్లు కృపానందం, జాన్‌మార్క్, జాన్‌వెస్లీ, జాన్‌పీటర్, రాజేష్, సుధాకర్, సీమోన్, అబ్రహాం, కమల్, ఐడీ కార్డుల దాత కుంచపు శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

మద్యం వద్దు.. ఓటు ముద్దు



నెల్లికుదురు: మద్యం వద్దు ఓటు ముద్దు అని మద్యం మత్తులో ఓటు వేసి భవిష్యత్ అంధకారం చేసుకోవద్దని చెల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు, జాతీయ అవార్డు గ్రహీత పరికిపండ్ల అశోక్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఇనుగుర్తి మండలంలోని చిన్నముప్పారం గ్రామంలో ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నోటు మాటున ఓటు వేసి ప్రజాస్వామ్యాన్ని కూని చెయొద్దని తెలిపారు. ప్రతీ ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకుని బంగారు భవిష్యత్‌కు పునాదులు వేసుకోవాలని కోరారు. ముఖ్యంగా యువత తమ ఓటు హక్కును వినియోగించుకొని సరైన నాయకుడిని ఎన్నుకోవాలని సూచించారు. సరైన పాలకులను ఎన్నుకున్నప్పుడే అభివృద్ధి సాధ్యమని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి సహజ, పోస్టు మాస్టర్ శ్రీనివాసచారి, నరహరి, గ్రామస్తులు పాల్గొన్నారు.

'ఆర్‌ఎంపీలు పరిధికి మించి వైద్యం చేయొద్దు'

గూడూరు: మండలంలోని ఆర్‌ఎంపీలు పరిధికి మించి వైద్యం చేయొద్దని, బోర్డుల ముందు డాక్టర్లుగా పేరు తొలగించాలని వైద్యురాలు యమున అన్నారు. మండలంలోని అయోధ్యపురం పీహెచ్‌సీలో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఇటీవల ఓ ఆర్‌ఎంపీ ఓ గర్భిణికి వైద్యం అందించగా ఆమె ఎంతో ఇబ్బందులు పడ్డ విషయాన్ని తెలిపారు. అలాంటి వారిపై పోలీసు కేసు నమోదు చేయించామన్నారు. ఇక నుంచి గ్రామాల్లో ఆర్‌ఎంపీలు ప్రథమ చికిత్సలు మాత్రమే అందించాలని, ఎలాంటి వారినైనా ప్రభుత్వ ఆస్పత్రులకు తరలించాలని సూచించారు.

పచ్చదనం ఆహుతి

- మంటల్లో కాలుతున్న హరితహారం మొక్కలు, చెట్లు
- పట్టించుకోని అధికారులు



కాలిపోయిన మొక్కలు

దంతాలపల్లి: అసలే వేసవికాలం భానుడి ప్రతాపంతో నీళ్ల లేక విలవిలలాడుతున్న మొక్కలకు ఆగంతకులు, రైతులు చేసే దుశ్చర్యలతో ప్రాణాపాయం తప్పడంలేదు. పచ్చదనంకోసం ప్రభుత్వాలు రూ.లక్షలు ఖర్చుచేసి పల్లె ప్రకృతి వనాలు, కాల్వలు, రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటి, వాటి సంరక్షణకు వాచర్లను నియమించి, కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లకు బాధ్యతలు అప్పగించింది. కానీ, మొక్కలు ఎదిగాకా సంరక్షణపై అధికారుల పర్యవేక్షణ కొరవడింది. మండలకేంద్రంలో బొడ్లాడ క్రాస్‌రోడ్డు నుంచి గోప్యా తండా వరకు సుమారు కిలో మీటర్ మేర నెల్లికుదురు వెళ్లే రహదారికి ఇరువైపులా సుమారు 500 మొక్కలు నాటారు. ఆ మొక్కలు పెరిగి రోడ్డుపై వెళ్లే ప్రయాణికులకు నీడను ఇస్తున్నాయి. ఈక్రమంలో రోడ్డుకు ఇరువైపులా పంటపొలాలు ఉన్న రైతులు తమ పంటపొలాల్లో వ్యర్థాలను కాలుస్తుండడం, ఆకతాయిలు మొక్కలు, చెట్లకు నిప్పంటించడంతో కాలిబూడిదవుతున్నాయి. కొన్ని చెట్లు ఆకులు, కొమ్మలు కాలిపోయి బతికే ఉన్నా.. పట్టించుకునేవారు లేక విలవిలలాడుతున్నాయి. ఈమార్గంలో చెట్లు సోమవారమే కాలిపోయినప్పటికీ ఇప్పటివరకు అధికారులు అటువైపు వెళ్లి చూడకపోవడం గమనార్హం. ఇప్పటికైనా అధికారులు స్పందించి మిగతా మొక్కలను సంరక్షించి, పచ్చదనాన్ని కాపాడాలని ప్రజలు, ప్రకృతి ప్రేమికులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



మొక్కలను రక్షించేందుకు తగిన చర్యలు తీసుకుంటాం. ట్యాంకర్ల సాయంతో నీటిని పడతాం. చెట్టు, మొక్కలను కాల్చినవారిని గుర్తించి చర్యలు తీసుకుంటాం.

– వివేక్‌రామ్, ఎంపీడీఓ

ప్రమాదవశాత్తు మామిడి తోట దగ్ధం



దగ్ధమైన మామిడి తోట

కొత్తగూడ: మామిడి తోట దగ్ధమైన సంఘటన మండలంలోని వేలుబెల్లి గ్రామంలో గురువారం జరిగింది. బాధితురాలు కర్ర నర్సమ్మ తెలిపిన వివరాల ప్రకారం.. వేలుబెల్లి పెద్ద చెరువును ఆనుకుని ఉన్న నాలుగు ఎకరాల మామిడి తోట కాత అందే సమయంలో ఉంది. ఈక్రమంలో చెట్లకింద ఉన్న ఎండిన ఆకులు, గడ్డికి నిప్పు అంటుకుని మంటలు చెలరేగాయి. ఈమంటల వేడికి తోటలోని చెట్లన్ని ఎండిపోయాయి. దీంతో సుమారు రూ.5లక్షల వరకు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని నర్సమ్మ వేడుకుంది.

ఓటు హక్కుపై అవగాహన అవసరం



ప్రతిజ్ఞ చేయిస్తున్న మున్సిపల్ కమిషనర్

తొర్రూరు: ప్రతి ఒక్కరూ ఓటుహక్కుపై అవగాహన కలిగి ఉండాలని మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్ అన్నారు. గురువారం తొర్రూరు డివిజన్ కేంద్రంలోని మున్సిపాలిటీ కార్యాలయంలో మెప్మా సిబ్బందితో సమావేశం చేపట్టారు. అనంతరం ఓటు వినియోగించుకునేలా ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందదర్భంగా కమిషనర్ మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కుపై అవగాహన కలిగి ఉండాలని, ఓటు హక్కు అనేది వజ్రాయుధం లాంటిందని పేర్కొన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి ఓటరు ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మిత్రులకు, స్నేహితులు, బంధువులకు ఓటు హక్కు ప్రాధాన్యత తెలిజేయాలని పేర్కొన్నారు. డీఎంసీ విజయ్, లావణ్య పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో బాలికల ప్రతిభ



సీహెచ్.హర్షిత డీఎస్.జమున బి.భద్రమ్మ

కురవి: మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల/ కళాశాలకు చెందిన ఐదుగురు బాలికలు జేఈఈ మెయిన్స్‌లో అత్యంత ప్రతిభ కనపరిచినట్లు కాలేజీ ప్రిన్సిపాల్ మార్త సంతోష్ గురువారం తెలిపారు. వచ్చే నెల(మే 25న) జరగబోయే జేఈఈ అడ్వాన్స్‌కు అర్హత సాధించినట్లు ఆయన వివరించారు. కాలేజీకి చెందిన సీహెచ్.హర్షిత(87.02), డీఎస్ జమున(67.76), టి.అంజలి(68.06), బి.భద్రమ్మ(49.23), బి.మహేశ్వరీ(47.49) పర్సంటైల్ సాధించినట్లు వివరించారు.

జెమినినాయక్‌కు 54వ ర్యాంకు

దోర్నకల్: జేఈఈ మెయిన్స్–2024 ఫలితాల్లో ఎస్టీ కేటగిరీలో దోర్నకల్‌కు చెందిన జాటోత్ జెమినినాయక్ జాతీయస్థాయిలో 54వ ర్యాంకు సాధించారు. ఖమ్మం శ్రీచైతన్యలో ఇంటర్ పూర్తి చేసిన జెమినినాయక్.. జేఈఈ మెయిన్స్ సెషన్–1 పరీక్షలో 99.2 పర్సెంటైల్ సాధించగా గురువారం ప్రకటించిన ర్యాంకులలో జాతీయస్థాయిలో ఎస్టీ కోటాలో 54వ ర్యాంకు సాధించారు. అలాగే, దోర్నకల్ సెయింట్ ఆగ్నేస్ పాఠశాలలో 10వ తరగతి వరకు చదివి ఖమ్మం శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్ పూర్తి చేసిన కామేపల్లి మండలం గరిడెపల్లికి చెందిన ధారావత్ శిరీష ఎస్టీ కేటగిరీలో జాతీయస్థాయిలో 13వ ర్యాంకు సాధించింది.



జెమినినాయక్ కాలు

కాలుకు 55వ ర్యాంకు..

మహబూబాబాద్ రూరల్ : జేఈఈ మెయిన్స్ పరీక్ష ఫలితాల్లో మహబూబాబాద్ మండలం రేగడితండా గ్రామానికి చెందిన గుగులోత్ హత్తిరాం, మంగమ్మ దంపతుల కుమారుడు కాలు జాతీయ స్థాయిలో 55వ ర్యాంకు సాధించాడు. హత్తిరాం, మంగమ్మ దంపతులు నిరుపేదలు. తమ కుమారుడిని కష్టపడి చదివించారు. కాలు కూడా వారి నమ్మకం వమ్ము చేయకుండా జేఈఈ మెయిన్స్‌లో 55వ ర్యాంకు సాధించాడు. కాలు పదో తరగతి వరకు అనంతారం టీఎస్ మోడల్ స్కూల్, ఇంటర్ ఎంపీసీ ఖమ్మంలోని ఎస్సార్ కళాశాలలో చదువుకున్నాడు.

మలేరియాను దూరం చేద్దాం



మరిపెడలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య బృందం



గార్ల: సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రాజ్‌కుమార్ జాదవ్

మరిపెడ: మలేరియాపై సమిష్టిగా పోరాడి అంతం చేద్దామని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి గుగులోతు రవికుమార్ పిలుపునిచ్చారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మరిపెడ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన ర్యాలీ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనఫిలిస్ అనే దోమ కుట్టడం వల్ల మలేరియా జ్వరాలు వస్తాయన్నారు. గ్రామాల్లోని ప్రతి ఒక్కరూ పరసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతి మంగళవారం, శుక్రవారం డ్రై డే కార్యక్రమం నిర్వహించాలని మురుగు నీటి నిల్వ ఉన్న ప్రదేశాల్లో ఆయిల్ బాల్స్ వేసి దోమలు లార్వాలు పెరుగకుండా అవగాహన కల్పించాలన్నారు. జ్వరాలు వస్తే వెంటనే ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శాంతకుమారి, సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు, కృష్ణ, సుధాకర్, సుదర్శన్, శోభరాణి, లక్ష్మీ, సాయిశ్రీ, శ్రీదేవి, స్వప్న, అనిత, సోములు తదితరులు పాల్గొన్నారు.

మలేరియా నివారణలో భాగస్వాములు కావాలి

గార్ల: మలేరియా నియంత్రణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ముల్కనూరు పీహెచ్‌సీ డాక్టర్ రాజ్‌కుమార్ జాదవ్ కోరారు. ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం సందర్భంగా స్థానిక పీహెచ్‌సీలో జరిగిన వైద్యసిబ్బంది సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎక్కువగా తడి ప్రాంతాలు, నీటి నిల్వ ఉండే ప్రాంతాలు, టైర్స్, కొబ్బరి బొండాలు, డ్రమ్ములు, మురికి కాలువలు, పగిలిన బకెట్లు, సెప్టిక్ ట్యాంకులు, నీటి తొట్లు వంటి నీటి నిల్వలు ఉన్న ప్రాంతాల్లో దోమలు గుడ్లు పెట్టడంద్వారా వాటి వ్యాప్తి పెరిగి వ్యాధులకు కారణం అవుతున్నాయని తెలిపారు. కావున నీటి నిల్వలు లేకుండా శుభ్రత పాటిస్తే దోమల పెరుగుదలను అరికట్టవచ్చని సూచించారు. దోమకాటు వల్ల వచ్చే మలేరియా వ్యాధిను రక్త పరీక్ష ద్వారా నిర్ధారణ చేసుకొని తగు చికిత్స తీసుకోవాలని సూచించారు. సమావేశంలో జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ రవితేజ, డాక్టర్ నవీన్, హెచ్ఈఓ శ్రీహరి పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్‌ఎస్‌లను ఎన్నికల్లో ఓడించాలి

- సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి

కురవి: బయ్యారం ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయలేని బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలను పార్లమెంటు ఎన్నికల్లో ఓడించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో నియోజకవర్గస్థాయి కౌన్సిల్ సమావేశం రామగోని రవి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బయ్యారంలో ఉక్కు పరిశ్రమ, ఖాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ, గిరిజన యూనివర్సిటీలను ఏర్పాటు చేయలేని దద్దమ్మ పార్టీలైన బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలకు ఎన్నికల్లో బుద్ధిచెప్పాలన్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు, నల్లధనాన్ని వెలికి తీస్తామని, రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని చెప్పిన బీజేపీ మాట తప్పిందన్నారు. దేశ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టారని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కరణం రాజన్న, నాయకులు మారగాని బాలకృష్ణ, పోలేపాక వెంకన్న, తురక రమేష్, బుర్ర సమ్మయ్య, బొల్లం ఉప్పలయ్య, కలగూర నాగరాజు, నర్సింగం గురువయ్య, బూర్గుల కృష్ణ, అప్పాల వెంకన్న, నిలుగొండ నాగేశ్వర్‌రావు, అనిల్ పాల్గొన్నారు.

మామిడి కాయల పంపిణీ

కేసముద్రం: ఇనుగుర్తి మండల కేంద్రంలో గంజి శ్రీనివాస్‌రెడ్డి అనే రైతు తన తల్లి ఉపేంద్రమ్మ జ్ఞాపకార్థంగా పలువురికి మామిడికాయలను గురువారం ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన తల్లి ఉపేంద్రమ్మ స్మృతివనంలో గత 33 మామిడి చెట్లకు కాసిన కాయలను సుమారు 80 కుటుంబాలకు అందజేసినట్లు తెలిపారు. మా అమ్మ బతికి ఉన్నప్పుడు ఆమెకు వ్యవసాయ పనుల్లో చేదోడు, వాదోడుగా నిలిచిన పేద కుటుంబాలకు ప్రతి సంవత్సరం మామిడి కాయలను అందిస్తున్నట్లు తెలిపారు. ముందుగా ఉపేంద్రమ్మ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆవుల పద్మ, యాకమ్మ, యాదమ్మ, వెంకటమ్మ, అండాలు, మహేంద్ర పాల్గొన్నారు.

విహారయాత్రతో విజ్ఞానం



రామప్ప ఆలయం వద్ద విద్యార్థులు

మంగపేట : మండలంలోని రాజుపేట జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వ పథకం పీఎంశ్రీ నిధులపై ప్రత్యక్ష అనుభవం కల్పించేందుకు విహారయాత్రకు తరలినట్లు హెచ్‌ఎం భాస్కర్‌రావు తెలిపారు. ఈ సందర్శనతో విద్యార్థుల్లో మనోవిజ్ఞానం, వికాసం, వినోదంతో సృజనాత్మక శక్తి ఏర్పడుతుందన్నారు.

రూ.38వేల ఆర్థికసాయం అందజేత



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్

కేసముద్రం: మండలంలోని ఉప్పరపల్లి గ్రామానికి చెందిన అన్నెపాక సురేందర్ ఇటీవల అనారోగ్యానికి గురై కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు కేసముద్రం స్టేషన్ హైస్కూల్ 1994–1995ఎస్సెస్సీ బ్యాచ్‌కి చెందిన పూర్వ విద్యార్థులు స్పందించి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.36వేల ఆర్థికసాయాన్ని గురువారం అందజేశారు. అదేవిధంగా ఉప్పరపల్లి గ్రామస్తులు రూ.2,300 అందించారు.

బాధిత కుటుంబానికి అందజేత

ఇనుగుర్తి మండలం కోమటిపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత చిర్రగోని సారయ్య ఇటీవల మృతి చెందాడు. ఈ మేరకు గ్రామ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి రూ.27,500 ఆర్థికసాయాన్ని గురువారం అందజేశారు. సారయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కూరెల్లి సతీష్, రావుల మల్లేశం, బాలునాయక్, శ్రీను పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ కుటుంబానికి పరామర్శ

మరిపెడ రూరల్: మరిపెడ మండలం ఎల్లంపేట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గండి మస్తాన్ (70)అనారోగ్యంలో గురువారం మృతి చెందాడు. మృతదేహాన్ని సందర్శించిన డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్, బీఆర్‌ఎస్ నేత డీఎస్ రవిచంద్ర నివాళులర్పించారు. గండి మహేష్, పరమేశ్వర్‌లను ఆయన పరామర్శించారు. వారి వెంకట మాజీ సర్పంచ్ తాళ్లపల్లి శ్రీనివాస్, రఘురాఘవులు, గండి పుల్లయ్య, అంబరీష, బాదర్‌సింగ్ ఉన్నారు.



కేసముద్రం: ఆర్థికసాయాన్ని అందజేస్తున్న పూర్వ విద్యార్థి

విద్యార్థిని ఆత్మహత్య



ప్రవళిక (ఫైల్)

పెద్దవంగర: ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఫెయిలయ్యానని మనస్తాపానికి గురైన ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన పెద్దవంగర మండలం చిట్యాలలో చోటు చేసుకుంది. ఎస్సై మహేష్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఈదురు ప్రవళిక (16) మానుకోట జిల్లా కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ కళాశాలలో ఇంటర్ పీఎస్‌టీటీ (ప్రీ స్కూల్ టీచర్ ట్రైనింగ్) మొదటి సంవత్సరం పూర్తి చేసింది. బుధవారం ఫలితాలు వెలువడగా ఫెయిలైంది. దీంతో మనోవేదనకు గురైంది. గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై మృతురాలు తండ్రి రామనర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి

మహబూబాబాద్ అర్బన్: బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని, మానుకోట పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థి గెలుపు తథ్యమని బీజేపీ బూత్‌ల ఇన్‌చార్జ్ శ్యామ్‌సుందర్ శర్మ అన్నారు. మానుకోట మున్సిపల్ పరిధిలోని పలు వార్డులు, బూత్‌స్థాయిలో బీజేపీ బూత్ అధ్యక్షులు, నాయకులు ప్రచారం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యామసుందర్ శర్మ మాట్లాడుతూ.. దేశం అభివృద్ధి చెందాలంటే మోదీతోనే సాధ్యమవుతుందన్నారు. తెలంగాణలో 14ఎంపీ స్థానాల్లో బీజేపీ గెలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అజ్మీరా సీతారాం నాయక్‌ను గెలిపించుకొని మానుకోటను మరింత అభివృద్ధి చేసుకుని, అనేక పరిశ్రమలు తెచ్చుకుందామన్నారు. యుతకు, మహిళలకు ఉద్యోగ ఉపాధి కల్పన అవకాశందన్నారు. 186 నుంచి 250 బూత్‌ల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బోయినపల్లి లక్ష్మణ్‌రావు, రాధపటిల్, శంకర్, నరేష్, బాలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యం



గ్యారంటీ పథకాల కరపత్రాలు చూపుతున్న నాయకులు

గూడూరు: కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బలరాంనాయక్ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు కృషి చేయాలని బ్లాక్ కాంగ్రెస్, మండల మాజీ అధ్యక్షుడు నూనావత్ రమేశ్‌నాయక్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ఎన్నికల్లో తాను ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీలో ఉన్నా కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి నష్టం చేయలేదన్నారు. పార్టీ అధిష్టానానికి తాను ఎందుకు పోటీలో ఉన్నానో తెలిపానని, అందుకే డీసీసీ చైర్మన్ తిరిగి పార్టీలో చేర్చుకున్నారని తెలిపారు. తన కుటుంబం మొత్తం మొదటి నుంచి గాంధీ కుటుంబ వారసులుగా పనిచేశామని, ఐనా కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ చర్యలకు కట్టుబడి ఉన్నాను కాబట్టే తిరిగి పార్టీలో చేర్చుకోగా, కాంగ్రెస్ అభ్యర్థి బలరాంనాయక్ గెలుపుకోసం పనిచేస్తున్నామన్నారు. అనంతరం రాములుతండా, పానుగోడు, చిర్రకుంటతండా గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మల్లేష్‌యాదవ్, గోపగాని యాదగిరిగౌడ్, గోదాసి వెంకన్న, కత్తి కృష్ణ, గుగులోతు లక్ష్మణ్‌నాయక్ పాల్గొన్నారు.

బలరాంనాయక్‌ను ఆశీర్వదించాలి

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్‌ను ప్రజలు ఆశీర్వదించి గెలిపించాలని అర్బన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య కోరారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో గురువారం రాత్రి ప్రచారం నిర్వహించారు. జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఖలీల్, నాయకులు ఆసిఫ్, బానోత్ ప్రసాద్, బొల్లు రాజు, గుగులోత్ వంశీ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక



కాంగ్రెస్‌లో చేరుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

పెద్దవంగర: మండల పరిధిలో వడ్డెకొత్తపల్లి గ్రామానికి చెందిన మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ముత్తినేని రమాదేవి శ్రీనివాస్, రైతు సమన్వయ కమిటీ చైర్మన్ తంగెళ్లపల్లి మల్లికార్జున చారితోపాటు 25 మంది బీఆర్‌ఎస్ నాయకులు బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేశారు. గురువారం తొర్రూరు డివిజన్ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఝాన్సీరెడ్డి వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ ఫ్లోర్‌లీడర్ ప్రవీణ్‌రావు, సీనియర్ నాయకులు జాటోతు నెహ్రూ నాయక్, తొర్రూరు పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్, పెద్దవంగర కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్, తదితరులు పాల్గొన్నారు.

డీజే సౌండ్ నిర్వాహకుడి బైండోవర్

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మండలంలోని మొట్ల తండా గ్రామానికి చెందిన డీజే సౌండ్ నిర్వాహకుడు గుగులోత్ విజయ్‌ను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామని రూరల్ ఎస్సై దీపికారెడ్డి గురువారం వెల్లడించారు. డీజే సౌండ్ నిర్వాహకుడు విజయ్ బుధవారం రాత్రి 10.30 గంటల సమయం దాటినప్పటికీ కంబాలపల్లి గ్రామంలో ఊరేగింపు జరుపుతుండగా ఆ వాహనాన్ని అదుపులోకి తీసుకున్నామన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

వెంకన్న మృతి బాధాకరం



నివాళులర్పిస్తున్న నాయకులు

మహబూబాబాద్ రూరల్ : ప్రజా సమస్యల పరిష్కారంలో మాజీ సర్పంచ్ పరకాల వెంకన్న ముందు వరుసలో ఉండేవాడని, అతని మృతి బాధాకరమని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపందా) జిల్లా కార్యదర్శి పాయం చిన్నచంద్రన్న అన్నారు. మహబూబాబాద్ మండలంలోని వీఎస్.లక్ష్మీపురం మాజీ సర్పంచ్ పరకాల వెంకన్న మృతదేహాన్ని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపందా) నాయకులు గురువారం సందర్శించి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా సహా కార్యదర్శి కొత్తపల్లి రవి, నాయకులు ముంజంపల్లి వీరన్న, బండపల్లి వెంకటేశ్వర్లు, పైండ్ల యాకయ్య, భిక్షపతి పాల్గొన్నారు.